
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శుక్రవారం 27 సెప్టెంబరు 2024 | 5





గ్యాస్ లీకేజీలను గుర్తించాలి

ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 26: జిల్లాలోని గ్యాస్ పైపులైను లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే అరికట్టే దిశగా చమురు సంస్థలు, జిల్లా అగ్నిమాపక శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో చమురు, సహజ వాయువుల వనరుల లభ్యత ప్రాంతాలు, వాటికి అనుబంధంగా ఏర్పాటు చేసిన గ్యాస్ పైపులైన్లు, ఇంటర్మీడియట్ స్టేషన్లు, గ్యాస్ వినియోగించే కంపెనీలు, గ్యాస్ లీకేజీల నివారణపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. జిల్లాలో అన్ని చమురు గ్యాస్ నిక్షేపాలను వెలికితీసి సరఫరా చేస్తున్న సంస్థలు ఆయా పైపులైన్లను మ్యాపింగ్ చేసి జిల్లా అగ్నిమాపక స్పందన సంస్థల స్టేషన్‌లో అందించాలన్నారు. చమురు సంస్థలు వారివారి జంక్షన్ పాయింట్లు, ఇంటర్మీడియట్ స్టేషన్‌లలో లీకేజీలు ఏర్పడడానికి అవకాశం ఉన్న స్పాట్‌లను మ్యాపింగ్ చేస్తూ నివేదిక రూపొందించాలన్నారు. పైపులైన్ల లీకేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక విపత్తు స్పందన అధికారి ఎన్.పార్థసారథి, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ సుందర్‌కుమార్, సీనియర్ ఫైర్ సేఫ్టీ అధికారి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థులకు

గోల్డెన్ అవర్ బీమా

ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

అమలాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వసతి గృహాల విద్యార్థులందరికీ గోల్డెన్ అవర్ బీమా సదుపాయం కల్పించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలు, అనాథాశ్రమాలు, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులందరికీ ఈ బీమా సదుపాయం వర్తింపచేస్తామన్నారు. విద్యార్థికి ప్రమాద సమయంలో గోల్డెన్ అవర్‌లో వినియోగించుకునేలా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు హెల్త్ ఇన్సూరెన్సు కల్పిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ ఇన్సూరెన్సు కంపెనీలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్త్రీ,శిశుసంక్షేమశాఖ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాము కాట్లు, ఫుడ్ పాయిజన్ వంటి ప్రమాదాలు తరచుగా సంభవిస్తున్న నేపథ్యంలో సంబంధిత సంక్షేమ అధికారులు హెచ్‌ఎంలు వారి సొంత నిధులు చెల్లించకుండా హెల్త్ ఇన్సూరెన్సు కవరేజ్ కోసం ఐసీఐసీఐ లాంబర్డ్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రతీ ఆసుపత్రి వద్ద సీసీ కెమెరాలు అమర్చి వాటిని కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి స్టోరేజ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రుల డేటాలను ఆయా పరిధిలోని పోలీసుస్టేషన్లకు మ్యాపింగ్ చేయాలన్నారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని అత్యవసర వైద్యసేవలు మ్యాపింగ్ కూడా ప్రత్యేకంగా రూపొందించాలన్నారు. సీసీ కెమెరాలు నిత్యం పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఐఎంఏ సభ్యులు డాక్టర్ మూర్తి, డాక్టర్ శర్మ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, సాంఘిక సంక్షేమశాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, ఐసీడీఎస్ అధికారులు విజయశ్రీ, రమణి, ఉమాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎన్నెన్నో.. అందాలు





గోదావరి జిల్లాలు.. ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్. అడుగడుగునా ఓ ప్రత్యేకత. ఆకుపచ్చని లోకంలో విహరించాలంటే ఖచ్చితంగా ఇక్కడకు రావాల్సిందే. ప్రకృతి రమణీయతకు అద్దంలా కనిపించే పచ్చని పైరు పంటలు.. కోనసీమ కొబ్బరి తోటల అందాలు ఎవరినైనా ఈ కొత్త లోకంలో విహరింపజేస్తాయి. ఇక పేరులోనే ఉన్న గోదావరి.. పరవళ్లు తొక్కే గోదావరికి ఆనుకుని పరుగులు పెట్టే పంట కాల్వలు, మరోవైపు దట్టమైన అడవి.. అందులో ఎగిసిపడే వాగులు..వంకలూ.. మరోవైపు పాపికొండల వయ్యారాలు..ఇటు చూస్తే అంతమే లేదన్నట్టు సాగిపోయే తీరంలో సముద్రపు అలల సవ్వడి.. ఇంకా కడియం పూలతోటలు.. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే ఆలయాలు.. అన్నిటికీ మించి అన్నవరం దేవా లయం. పర్యాటకం అంటే ఊటీకో, గోవాకో వెళ్లడం కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రండి.. చూస్తే పరవశించిపోవాల్సిందే..

- కాకినాడ/ రాజమహేంద్రవరం/ అమలాపురం (ఆంధ్రజ్యోతి)

ఓ వైపు కొబ్బరి చెట్లతో తివాచీ పరిచినట్టు పచ్చగా కనిపించే కోనసీమ.. ఇంకో వైపు గోదావరి నడుమ పాపికొండల వయ్యారాలు.. మరో వైపు మారేడుమిల్లి అటవీ అందాలు.. ఇంకోపక్క కాకినాడ సమీపంలో కోరింగ అభయారణ్యం.. ఇలా చెప్పుకుంటూపోతే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువేలేదు. కోరుకొండ, ఆదుర్రు, కొడవలిలో బౌద్ధ స్థూపాలు, పెద్దాపురంలో పాండవులమెట్ట వంటి చారిత్రక ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఇక అన్నవరం, అప్పనపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, ముక్తేశ్వరం, వాడపల్లి, కోటిపల్లి, ర్యాలీ, ద్రాక్షారామ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో చారిత్రక దేవాలయాలూ ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల విహారం ఆహ్లాదభరితం. ఎత్తయిన కొండలు, అటవీప్రాంతం మీదుగా వంపులు తిరుగుతూ ప్రవహించే గోదావరి అందాలను బోటులో నుంచి వీక్షించవచ్చు. గోదావరి తీరంలో ఉన్న చారిత్రక నగరం రాజమహేంద్రవరం. గోదావరి గట్టున ఉన్న రాళ్లబండి మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం ఇల్లు, పెద్ద మసీదు వంటివి చూడదగ్గవి. గోదావరి తీరంలో గౌతమిఘాట్‌ను ఆనుకుని టెంపుల్ స్ట్రీట్‌లో ఇస్కాన్ తదితర ఆలయాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరిలో బోట్ షికారు నిర్వహిస్తున్నా సరైన నిర్వహణ లేక దానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. పుష్కర ఘాట్‌లో నిత్య హారతి కార్యక్రమం వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కింది. రాజమహేంద్రవరానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధవళేశ్వరంలో 1852లో కాటన్ మహాశయుడు నిర్మించిన బ్యారేజీ తప్పక చూడాల్సిందే. రూపాయి ఖరీదు చేసే మొక్క నుంచి లక్షల విలువ చేసే దేశ, విదేశీ రకాల మొక్కలూ కడియం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన 600 నర్సరీల్లో కనిపిస్తాయి. వశిష్ఠ పాయ ఒడ్డున కోనసీమలో కొలువుదీరిన దిండి దశాబ్దకాలంలో పర్యాటకంగా బాగా ప్రాచుర్యం పొందింది. హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్ పేరుతో ఏపీ టూరిజం ఇక్కడ రిసార్ట్స్ నిర్వహిస్తోంది. దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్ బోట్లు ద్వారా నదీవిహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి గదులతో పాటు నాలుగు హౌస్‌బోట్లు, ఒక వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఆదుర్రులో బౌద్ధస్థూపం చరిత్రకెక్కింది. కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహారయాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధి చెందిన ఓడలరేవు, కొమరగిరిపట్నం, కేశనపల్లి, కేశవ దాసుపాలెం,అంతర్వేది, ఎస్.యానాం, చిర్రయానం బీచ్‌లు వేలాదిమందితో కళకళలాడుతున్నాయి. కోనసీమలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, గౌతమీనది చెంతన అయినవిల్లి సిద్ధి వినాయక, క్షణముక్తేశ్వరస్వామి, మురమళ్ళ వీరేశ్వర స్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, కడలిలో కపోతేశ్వర స్వామి, వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి, మందపల్లిలో శనేశ్వరస్వామి, ర్యాలిలో జగన్మోహినీ ఆలయాలు ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి.



మడ అడవులు

మడ అడవులు చూస్తే..మరువరు

దేశంలో పశ్చిమబెంగాల్ తర్వాత రెండో అతిపెద్ద మడ అడవులు కాకినాడలోనే ఉన్నాయి. వేల ఏళ్ల నాటి ఈ మడ అడవులు కాకినాడ నగరానికి రక్షణ గోడగా నిలుస్తున్నాయి. సునామీలు, వరదలు, తుఫాన్ల నుంచి కాకినాడతో పాటు కోనసీమలో ఎన్నో ప్రాంతాలను రక్షిస్తున్నాయి. నదీ జలాలు సముద్రంలో కలిసే చోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ ఇవి అందులోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు, పొదల సముదాయమే మడ అడవులు. తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. నది.. సముద్రంలో కలిసే ప్రదేశంలో సహజసిద్ధంగా పుట్టుకువచ్చే ఈ మడఅడవులు ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభ యారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కి.మీలో విస్తరించి ఉంది.వీటిలో 80 రకాల వృక్షజాతులున్నాయి.అతిపెద్దదైన కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి. ఇక్కడకు ఏటా 120 జాతుల పక్షులు వచ్చి విడిది చేస్తుంటాయి. ఎంతో మంది పర్యాటకులు వస్తున్నా సరైన సదుపాయాలే లేవు.

ఉమ్మడి జిల్లాలో ఊటీ..కొడైకెనాల్‌ను తలదన్నే పర్యాటక ప్రాంతాలు

- పర్యాటకానికి చిరునామా 'తూర్పు'
- గోదారి పరవళ్లు.. పచ్చని కోనసీమ
- అపార బీచ్‌లు.. ఏజెన్సీ అందాలు
- ఆధ్యాత్మికత.. పూల సోయగాలు
- కూటమి దృష్టిపెడితే..ఆదాయవనరు
- పట్టించుకుంటే ఇదే స్వర్గసీమ
- నిధుల లేమితో ప్రాజెక్టులు మూలకు
- పర్యాటకంగా కానరాని అభివృద్ధి
- తాజాగా రూ.100 కోట్లతో ప్రాజెక్టు

రూ.100 కోట్లతో అఖండ గోదావరి

కూటమి ప్రభుత్వం తాజాగా పర్యాటక రంగంపై దృష్టిపెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్త పర్యా టక పాలసీని తీసుకొని రావడానికి కసరత్తు చేస్తోంది. గోదావరి జిల్లాల్లో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ జిల్లాకు చెందినవారే కావడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందు తుందనే ఆశలు చిగురించాయి.అఖండ గోదా వరి కి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆయన స్పష్టం చేసి న సంగతి తెలిసిందే. ఇప్పటికే కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్కడ కాలువ లో బోట్ షికారు పెట్టనున్నా రు. పాపికొండలు ఇప్పటికే బోట్ షికారుతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే.

ఏజెన్సీ అందాలకు వెలుగేది..

చూపుతిప్పుకోలేని ప్రకృతి అందాలు తూర్పు ఏజెన్సీ సొంతం. మారేడుమిల్లి సమీపంలో అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్వహిస్తోంది. వనవిహారి పేరుతో మారేడుమిల్లిలో రిసార్ట్స్‌లో వసతి ఏర్పాట్లు కల్పించారు. ఈ రిసార్ట్స్‌లో స్టే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలి. ఎకో టూరిజంలో ప్రధానమైన పర్యాటక ప్రాంతం జంగిల్ స్టార్. ఇది పాములేరు వాగు పక్కనే ఉంది. పాములేరు బ్రిడ్జి నుంచి కిలోమీటరున్నర దూరం ఉంటుంది. జంగిల్ స్టార్ నేచరల్ క్యాంపులో గడిపాలనుకునే వారికి ఒక రాత్రంతా అడవిలో గడిపిన అనుభూతి కలుగుతుంది. కొంతకాలంగా గుడిసె అందాలను ఆస్వాదించడానికి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. వెదురుబొంగులలో పెట్టి తయారుచేసిన బొంగు చికెన్, బొంగు బిర్యాని ఇక్కడ స్పెషల్. మారేడుమిల్లికి 6 కిలోమీటర్ల దూరంలో జలతరంగిణి, కాఫీ తోటలు పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇటు రంపచోడవరానికి 6 కిలోమీటర్ల దూరంలో రంప ఉంది. ఇక్కడ 14వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ప్రాశస్త్యం పొందింది. శివాలయానికి కిలోమీటరు కొండపైకి వెళితే జలపాతం ఆకట్టుకుంటోంది. ఇన్ని అందాలున్నా వాటి అభివృద్ధికి మాత్రం ఎలాంటి చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యాటకరంగానికి మరింత శోభ చేకూరుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడేలా చేయడానికి రంగం సిద్ధమవుతోంది. హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు నుంచి మడ అడవుల వరకు అభివృద్ధి చేయడానికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి.

అందాలున్నా..ఆదరించలేదు..

ఓ వైపు సువిశాల సముద్ర తీరం..మరోవైపు జలజల పారే నదీ జలాలు..ఈరెండింటి మధ్య పొదలుగా...గుబురుగా.. సూర్యుడి వెలుతురు కూడా చొరబడనంత దట్టం గా విస్తరించిన మడ అడవులు.. కాకి నాడ కాజా..ఎన్టీఆర్ బీచ్..కుంభాభిషేకం.. అన్నవరం, పాదగయ..ఉప్పాడ బీచ్..ఉప్పాడ చీరలు.. పెరుమాళ్లపురం పాకంగారెలు.. చిట్టి ముత్యాల బిర్యానీ.. చిట్టిపెసరట్లు...ఇలా ఒకటేంటి కాకినాడ అంటే పర్యా టకులకు ఇలా చాలానే గుర్తొచ్చేవి.. పర్యాటకులను ఆక ర్షించే అవకాశం ఉన్నా గత వైసీపీ ప్రభు త్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసింది.పైసా నిధులు కూడా విదల్చకుండా పర్యాటక రంగానికి తూట్లు పొడిచింది. గడచిన ఐదేళ్లలో పర్యాటక రంగం పడకేసింది. వాస్తవానికి 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో పర్యాటక రంగానికి భారీ ఊపుతెచ్చింది. కాకి నాడ నుంచి ఉప్పాడ వరకు ఉన్న బీచ్‌రోడ్డును అభివృద్ధి చేసి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించింది.ఎన్టీఆర్ బీచ్‌ను అభివృద్ధి చేసి పర్యాటక ఉత్సవాలు, రోజుల తరబడి బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించింది.వైసీపీ వచ్చాక వీటన్నింటికి మంగళం పాడేసింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పర్యాటక అభి వృద్ధిపై దృష్టి సారించింది. పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ ఇప్పటికే సీఎం వద్ద పలు ప్రతిపాదనలు ఉంచారు. కాకినాడ జిల్లాలో అన్నవరం,పాదగయ, సామర్లకోట భీమేశ్వర ఆలయం.. ఉప్పాడ బీచ్ కలిపి టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ ఈ దిశగా హామీ కూడా ఇవ్వడంతో దీని అమలుపై కార్యాచరణ ప్రణాళికలు రచిస్తున్నారు.

వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీ..



వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీని తీసుకుని రానున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ వచ్చే మార్చి వరకూ అమలులో ఉంటుంది. మార్చి తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టుతో రాజమహేంద్రవరం అఖండ గోదావరి, కడియం, హేవలాక్, చారిత్రిక కట్టడాలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలోని ప్రాంతాలు, పశ్చిమగోదావరి జిల్లాలో పేరుపాలెం బీచ్ వంటివన్నీ అభివృద్ధి చేస్తాం. - **కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి**

భయం భయం

- చిరుతపులి సంచారం వార్తలతో దడదడ
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- జాగ్రత్తలను వివరించిన అధికారులు

మండపేట, సెప్టెంబరు 26: కడియంలో చిరుతపులి సంచారం సమాచారం వణుకు పుట్టిస్తోంది. మండపేట మండలంలో పలు గ్రామాల ప్రజలకు దడ మొదలైంది. కడియం మండలానికి ఆయా గ్రామాలు సమీపంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెంతనే ఉన్న తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వీరవరంలో చిరుత సంచరిస్తుందని అటవీ శాఖాధికారులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి మండపేట మండలంలో నర్సరీలు ఉన్న మెర్నిపాడు, పాలతోడు, వై.సీతానగరం ఏడిద గ్రామాలకు చిరుతపులి రావచ్చని అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమయ్యారు. పులి సంచరించే ప్రదేశం గుర్తించిన అటవీ శాఖాధికారులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. సాయంత్రం వేళ కానీ ఉదయం కానీ పులి సంచరించే ప్రదేశంలో ప్రజలెవరూ ఆరుబయటకు వచ్చేటపుడు గుంపులు గుంపులుగా రావాలని చేతిలకర్ర, చీకటి పడితే టార్చ్‌లైట్ ఉండాలని సూచించారు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత ప్రజలు గ్రామాల్లో బయట సంచరించవద్దని అధికారులు హెచ్చరించారు. పులిజాడ కనిపి ంచినప్పుడు వెంబడించవద్దని జిల్లా అటవీ అధికారులు ప్రజలకు సూచించారు. పులిజాడ దొరకటంతో పాటు చిరుత చిక్కే వరకు ప్రజలు అధికారులకు సహకరించాలని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, జిల్లా అటవీశాఖాధికారి ఎం.వి.ప్రసాదరావు కోరారు. ఇప్పటికే పులిజాడను కనుగొనేందుకు 60 మందితో కూడిన బృందం పని చేస్తుందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు చీకటి పడిన తర్వాత బయట సంచరించవద్దని గ్రామాల్లో ప్రజలను హెచ్చరించారు. పులి జాడ తెలిస్తే 9849156162, 9705909066 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.



మార్కెట్ కమిటీల భర్తీకి

గ్రీన్ సిగ్నల్

ఎమ్మెల్యేలకు బాధ్యతలు

- నియోజకవర్గ స్థాయిలో పదవుల జాతరకు కసరత్తు
- ఏఎంసీల పాలకవర్గాల భర్తీకి ప్రభుత్వం ఆదేశాలు
- జాబితాల రూపకల్పనలో ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు
- ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల జాతర మొదలైంది. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ సంస్థల ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో కూడా ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. కూటమి నేతల్లో సందడి మొదలైంది. నియోజకవర్గ స్థాయిలో కూడా భర్తీ చేసేందుకు పలు పదవులు ఉంటాయి. వాటిలో కీలకమైనవి వ్యవసాయ మార్కెట్ కమిటీలు..ఇప్పుడు మార్కెట్ కమిటీల నియామకానికి కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కమిటీల నియామకం బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకే అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది.

9 కమిటీలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 7 నియోజకవర్గాలలో 9 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అమలాపురం, అంబాజీపేట, కొత్తపేట, మండపేట, ఆలమూరు, రాజోలు, ముమ్మిడివరం, నగరం, రామచంద్రపురం మార్కెట్ కమిటీల్లో ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఆశలు పెట్టుకున్న రైతులు

వైసీపీ ఐదేళ్ల పాలనలో మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయాయి. కమిటీల ఛైర్మన్లు, డైరెక్టర్లు కేవలం పదవులు అనుభవించడానికి మాత్రమే ఉన్నారు అన్నట్లు వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ రైతులకు ఆశలు మొదలయ్యాయి. మళ్లీ రైతు బంధు, పశు వైద్య శిబిరాలు, గ్రామాల్లో పుంత రోడ్ల నిర్మాణం వంటివి అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కూటమి నేతలకే పదవులన్నీ..

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. ఐదు నియోజకవర్గాల్లో టీడీపీ, రెండు నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీల ఆశావహులు ఇప్పుడు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన వారంతా ఇప్పుడు ఎమ్మెల్యేల కటాక్షం పొందేందుకు తహతహలాడుతున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే మార్కెట్ కమిటీ పాలకవర్గాల భర్తీకి ఎమ్మెల్యేలు కసరత్తులు ప్రారంభించారు. ఎవరికి కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలనేదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ తాళాలు తెరుస్తున్న సిబ్బంది

ముమ్మిడివరం, సెప్టెంబరు 26: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల గోదాము భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్లు భద్రపరిచిన గోదామును గురువారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, రెవెన్యూ, ఎన్నికల, అగ్నిమాపక శాఖ అధికారులు, రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతీ త్రైమాసికానికి సంబంధించి ఈవీఎంలు , వీవీ ప్యాట్ల గోదామును క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి సంబంధిత తనిఖీ నివేదికను ఎన్నికల సంఘానికి సమర్పిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ తరుపున వడ్డి నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఆర్‌ఐ పి.శ్రీనివాస్ ఉన్నారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం

రూ.38 లక్షలు

7

డ్వాక్రా సభ్యుల నుంచి రూ.15 లక్షలు స్వాహా

కాకినాడ జీజీహెచ్‌లో ముగిసిన
క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: స్త్రీలలో సంభవించే పలు క్యాన్సర్లను నిర్మూలించే లక్ష్యంతో కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మాట్లాడుతూ 350 మందికి పరీక్షలు నిర్వహించగా వీఐఏ పరీక్షలో 44 కేసులు పాజిటివ్‌గా గుర్తించామన్నారు. వారిలో 43 మందికి చికిత్స అందిస్తుండగా మరొకరిని బయాప్సీ పరీక్ష చేయించుకోవాలని సూచించామన్నారు. వీఐఏ పరీక్ష, కోయాగ్యులేషన్ చికిత్స అందించడంపై స్థానిక వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సులకు అమెరికా నుంచి వచ్చిన వైద్య నిపుణుల బృందం శిక్షణ ఇచ్చిందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. థర్మల్ కోయాగ్యులేషన్ పరికరాన్ని అమెరికా వైద్య నిపుణులు జీజీహెచ్‌కు వితరణ చేశారు. శిబిరం విజయవంతమైన సందర్భంగా అమెరికా వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఐఎస్‌సీసీ అధ్యక్షుడు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల, అమెరికన్ కాలేజ్ ప్రసూతి, గైనకాలజిస్టులు డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హౌబాచ్, జీజీహెచ్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి, డాక్టర్ లక్ష్మీకిరణ్, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

ఎంపీహెచ్‌ఏలకు నియామక
ఉత్తర్వులు అందజేత

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 186 మంది ఎంపీహెచ్‌ఏ(ఎం)-2002 అభ్యర్థులకు కండిషనల్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీహెచ్‌ఏ (ఎం) అభ్యర్థులు కొంతమంది కోర్టుకి కంటెస్ట్ చేయగా... కోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతలను పరిశీలించారు. విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 86 మంది సీసీలకు గాను 185 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ ద్వారా కండిషనల్ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు అందించారు.

కొండ చిలువ హతం



కిర్లంపూడి, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురంలో పది అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. ఇటీవల ఏలేరు వరదల్లో కొండ చిలువలు కొట్టుకొచ్చాయని గ్రామస్తులు తెలిపారు. గత ఆదివారం ఏలేరు కాలువలో కొండచిలువ కొట్టుమిట్టాడుతుంటే దాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో సైతం పెట్టారు. రామచంద్రపురంలో మొక్కల రక్షణ కోసం వేసిన వలలో గురువారం కొండ చిలువ చిక్కుకోగా గ్రామస్తులు గమనించి దానిని హతమార్చారు.



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అకస్మాత్తుగా బదిలీ చేశారు

న్యాయం చేయాలని జేసీకి గ్రామ సర్వేయర్ల వినతి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ జిల్లాలోని 30 మంది గ్రామ సర్వేయర్లను ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండా అకస్మాత్తుగా కోనసీమ జిల్లాకు బదిలీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 20 మండలాల నుంచి 30 మంది గ్రామ సర్వేయర్లను ముందస్తు సమాచారం లేకుండా కోనసీమ జిల్లాకు బదిలీ చేశారన్నారు. చాలా మందికి కుటుంబ పరంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులున్నాయని తమ బదిలీలను పునః పరిశీలించాలని కోరారు.

కాకినాడ జిల్లా నుంచి 30మంది సర్వేయర్లను కోనసీమ జిల్లాకు బదిలీ చేసిన ఉత్తర్వులను పునః పరిశీలించాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు కోరారు.





కడియపులంకలో చిరుత సంచరిస్తున్నట్టు భావిస్తున్న ప్రాంతం (పైన) ట్రాప్ బోను (కింద)

కడియపులంకలోనే చిరుత

కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కడియం, సెప్టెంబరు 26: తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజలకు మూడు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి అడుగుజాడలను అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కడియపులంక, బుర్రిలంక, దోసాలమ్మ కాలనీ వద్ద గమనించిన అటవీ శాఖ అధికారులు ఎస్.భరణి, ప్రసాదరావు చిరుతపులి కడియపులంక ప్రాంతంలోనే ఉందని తెలిపారు. పులి కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రొఫెషనల్ హెల్పర్లతో కలిపి కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ డివిజన్లకు సంబంధించి అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ అధికారులు అంతా చిరుత పులిని పట్టుకునే పనిలోనే ఉన్నారు. పులి కదలికలను పరిశీలించేందుకు 20 కెమెరాలు, సోలార్‌తో పనిచేసే 4 సీసీ కెమెరాలు, 2 బోనులు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరంలో మరో ఆరు బోన్లు ఉన్నాయని, అవసరమైతే వాటిని కూడా తీసుకు వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం రాత్రి పులిని పట్టుకునేందుకు కడియపులంక చుట్టూ అటవీ శాఖ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత ఎవరూ బయట తిరగొద్దని, అవసరమనుకుంటే ముగ్గురు, నలుగురు కలిపి రావాలన్నారు. ఒకరోజు ఆలస్యమైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా పులిని బంధిస్తామని అటవీ శాఖ అధికారులు చెప్పారు.

పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు

డీఎఫ్‌వోలు భరణి, ప్రసాదరావు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ చిరుత పులి కొనసాగుతోంది. అది దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్టు నుంచి కడియం నర్సరీల్లోకి వెళ్లింది. దానిని పట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశాం. థర్మల్ డ్రోన్ సహాయంతో గమనిస్తున్నాం. కెమికల్ మొబిలైజేషన్ ద్వారా పట్టుకోవడానికి శిక్షణ పొందిన నిపుణులు కూడా వస్తున్నారు' అని తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎఫ్‌వోలు ఎస్.భరణి, ప్రసాదరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భరణి మాట్లాడుతూ... చిరుత ఈనెల 19న దివాన్‌చెరువు ఆర్‌ఎఫ్‌లో చివరగా కనిపించిందని, ప్రస్తుతం కడియం నర్సరీల్లో దాని పాద ముద్రలు గుర్తించినట్టు తెలిపారు. వర్షాల వల్ల ఆ ముద్రలు ఎటువైపు ఉన్నాయనేది లభ్యం కాలేదన్నారు. ప్రస్తుతం ఏ నర్సరీలో ఉందో స్పష్టత ఉందని, 20 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, నర్సరీ అసోసియేషన్‌కు చెందిన సీసీ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. ట్రాప్ కేసు (బోను)లు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గోదావరి వరదల వల్లే ఇటు వచ్చి ఉంటుందని భావిస్తున్నామని, రిజర్వ్ ఫారెస్టులాగే సీతాఫలాల చెట్లు, నర్సరీలను కూడా అది నివాస ప్రాంతంగా భావిస్తుందన్నారు. కడియం ప్రాంతానికి కోనసీమ జిల్లా దగ్గరగా ఉండడం వల్ల ఆ ప్రాంతంలో కూడా అప్రమత్తం చేస్తున్నట్టు చెప్పారు. అది కచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందో గమనించి, ఆయా నర్సరీల వైపు ఎవరూ వెళ్లకుండా అప్రమత్తం చేసినట్టు చెప్పారు. కోనసీమ డీఎఫ్‌వో ప్రసాదరావు మాట్లాడుతూ తమ జిల్లా పరిధిలోని ఏడిద, మెర్నిపాలెంల్లో నర్సరీలు ఉన్నాయని, అక్కడ కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అది కుక్కలను తింటూ జీవిస్తోందన్నారు. చిరుత సంచరించే ప్రాంతాల్లో ప్రజలు బహిరంగ మల విసర్జన చేయవద్దని కోరారు. కడియపులంక సర్పంచ్ రాంజీ మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని వివరించారు.

బ్యాంకు కస్టమర్ పాయింట్‌లో రూ.15 లక్షలు స్వాహా

- ఏడాదిగా జరుగుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- డ్వాక్రా సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఇంటిగ్రా కంపెనీ అధికారులు
- లబోదిబోమంటున్న డ్వాక్రా మహిళలు

అంబాజీపేట, సెప్టెంబరు 26: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం... బ్యాంకు అధికారుల ఉదాసీనత... డ్వాక్రా యానిమేటర్ల ఇష్టారాజ్యం... డ్వాక్రా సంఘ సభ్యుల పాలిట శాపంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ పరిధిలో ఇంటిగ్రా కంపెనీ ద్వారా బ్యాంకింగ్ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్నారు. దీనిని నిర్వహిస్తున్న పరమట మణి డ్వాక్రా సభ్యులు చెల్లించిన రుణాలను బ్యాంకుకు గత ఏడాది నుంచీ చెల్లించట్లేదు. సుమారు రూ.15లక్షల మేర డ్వాక్రా సభ్యుల రుణాలు స్వాహా చేసినట్టు తెలిసింది. బ్యాంకు అధికారులకు అనుమానం రాకుండా డ్వాక్రా సంఘాలు చెల్లించిన రుణాన్ని ఒక నెల బ్యాంకుకు చెల్లించి మరో రెండు నెలలు స్వాహా చేసింది. ఈ వ్యవహారం ఏడాదిగా జరుగుతున్నా ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు, యానిమేటర్లు పట్టించుకోలేదు. బ్యాంకు అధికారులు యానిమేటర్లకు సూచించినా పట్టించుకోకపోవడంతో డ్వాక్రా సంఘాల సభ్యులు మోసపోయారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులు, యానిమేటర్ల తీరుపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పరిధిలోని 9 గ్రూపులకు సంబంధించి ఇప్పటివరకు రూ.15 లక్షలకుపైగా ఆ మహిళ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సిద్ధార్థ్ ద్వారా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకుకు డ్వాక్రా సంఘాలు రుణాలు ఎందుకు చెల్లించట్లేదన్న వివరాలు సేకరించారు. అప్పటికే తాము బీసీ పాయింట్ నిర్వహిస్తున్న పరమట మణి ద్వారా రుణాలు చెల్లించామని మేనేజరుకు తెలిపారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించారు. బ్యాంకు సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్న థర్డ్ పార్టీ ఇంటిగ్రా కంపెనీకి ఆ మేనేజరు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటిగ్రా కంపెనీ క్లస్టర్ హెడ్ రఘుచంద్రన్, సూపర్‌వైజర్ నరేష్ గ్రామంలో సంఘ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. వివరాల సేకరణ అనంతరం ఎంత మొత్తం స్వాహా జరిగిందో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రకాశ్‌బాబు

'కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలు చెప్పాలి'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకునే ముందు అందుకు కారణాలను అతడికి లేదా కుటుంబ సభ్యులకు కచ్చితంగా చెప్పాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ప్రీ-అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం-2012, ఆంధ్రప్రదేశ్ బాధితుల పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో తన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక పరిస్థితులు లేనిపక్షంలో డీఎల్ఎస్ఏ అందించే ఉచిత న్యాయ సేవలు, ఉచితంగా న్యాయవాదిని పొందే హక్కు వారికి ఉందని తెలియజేయాలన్నారు. నోటీసు, అరెస్టు, చార్జ్‌షీట్, విచారణ, రిమాండ్... ఇలా ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. బాధితులకు డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తున్న పరిహారంతో పాటు పలు చట్టాల గురించి వివరించారు. సదస్సులో పాడేరు అడిషనల్ ఎస్పీ జగదీశ్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో గాలిస్తున్న అధికారులు

దొరకని హరదీప్ ఆచూకీ

- ఐదు రోజులుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ఏఎన్ఎస్, డాగ్‌స్క్వాడ్‌లతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 26: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల విద్యార్థి చింతకుంట్ల హరదీప్ అచూకీ ఇంకా లభ్యం కాలేదు. మెడికో ఆచూకీ కోసం గత ఐదు రోజులుగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఏఎన్ఎస్ పార్టీలను రంగంలోకి దించారు. డాగ్‌స్క్వాడ్ సాయంతో పాములేరు వాగు పరివాహక ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గాలింపు చర్యలకు వర్షం అడ్డంకిగా మారింది. అయితే అధికారులు తలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు, పాములేరు వాగు నుంచి వాగు పరివాహక ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు నీటి ప్రవాహంలో గాలిస్తున్నాయి. వాగు వెంబడి ఉన్న దట్టమైన పొదలు, అటవీ ప్రాంతంలో ఏఎస్పీ జగదీష్ అడహళ్లి నేతృత్వంలో యాంటీ నక్సల్స్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ అణువణువునా జల్లెడపడుతున్నాయి. గురువారం చీకటి పడే వరకు ప్రయత్నించినప్పటికీ హరదీప్ ఆచూకీ లభించలేదు. దొరికే వరకు గాలింపు చర్యలు కొనసాగిస్తామని అధికారులు చెప్తున్నారు. మరోపక్క కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రవిప్రసన్న ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, సీఐ మురళీకృష్ణ సిబ్బంది పలు సూచనలు చేస్తూ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

జాతీయ కరాటే పోటీలకు వైష్ణవి ఎంపిక



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26: కాకినాడలో ఈ నెల 22న జరిగిన కరాటే ఓపెన్ స్టేట్ టోర్నమెంటులో 65 కిలోల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల బీఎస్సీ సెకండియర్ విద్యార్థి ఎల్.వైష్ణవి గోల్డ్ మెడల్ సాధించింది. ఉత్తరాఖండ్‌లో నవంబరు 2,3 తేదీల్లో జరగబోయే జాతీయ పోటీలకు అర్హత సాధించిదని ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. వైష్ణవికి స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిశోర్‌బాబు, డీవీ రమణ మూర్తి, బీహెచ్‌వీ మూర్తి, ఎంవీ నరసింహ అభినందనలు తెలిపారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.38 లక్షలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 26: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 54 రోజులకు రూ.38,08,336 ఆదాయం వచ్చిందని దుర్గాభవాని తెలిపారు. లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, నాయకులు ముప్పనపల్లి గణేష్, పెంకె సాంబశివరావు, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, కర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 26: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఆయన పొగాకు రైతులతో సమీక్షించారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వచ్చే ఏడాది కూడా ఇలాగే ఉంటుందని రైతులు భావించవద్దన్నారు. ఈ ఏడాది ఏపీలో 170 మిలియన్ కిలోలు, కర్ణాటకలో 100 మిలియన్ కిలోల పరిమితిని బోర్డు ఇచ్చిందని, ఆ మేరకే రైతులు పంట సాగు చేయాలన్నారు. అధికంగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము ఉంటుందని హెచ్చరించారు. ఆమోదయోగ్యంగా లేని చౌడు నెలల్లో, బద్వాల్లోనూ పొగాకు పంట వేయవద్దని హెచ్చరించారు. గత ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందన్నారు. ఈ ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే, కెన్యా, ఆఫ్రికా దేశాల్లో పొగాకు సాగు ఎక్కువగా చేశారని, రైతులు తక్కువ సాగులో ఎక్కువ ఉత్పత్తి చేసే విధంగా చూసుకోవాలన్నారు. ఈ ఏడాది ఎన్‌ఎల్ఎస్ ఏరియాలో సరాసరి ధర కిలో రూ.326 ఉండగా నల్లరేగడి నేలలో సరాసరి ధర రూ.282 ఉందన్నారు. అనంతరం దేవరపల్లి శివారు పల్లంట్ల రోడ్డులో పొగాకు నారుమడులను చైర్మన్ పరిశీలించారు. నారుమడులకు తెగుళ్లు సోకకుండా తగు జాగ్రత్తలు, సూచనలు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి వెంకటశ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, క్రాటు సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, రైతులు సింహాద్రి ధర్మవతారం, యాగంటి సాయిబాబు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి
పదేళ్ల జైలు శిక్ష

సామర్లకోట, సెప్టెంబరు 26: మతి స్థిమితం లేని మహిళపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడిన చింతపల్లి నూకరాజుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు గురువారం తీర్పు చెప్పారు. ఎం.తరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు 202-2019, యూ-ఎస్ 376(2)(ఎం) ఐపీసీ పేరిట అప్పటి ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి నూకరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తదుపరి విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. రాజమహేంద్రవరం కోర్టులో ట్రయల్ జరగ్గా పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాది తరఫున వాదన వినిపించా రు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి పై విధంగా శిక్ష విధించారని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ చెప్పారు.

భార్యను వేధించిన వ్యక్తికి
నాలుగేళ్ల జైలు

అన్నవరం, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో భార్యను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడినట్టు అన్నవరం ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కోటనందూరు మండలం బీబీ పట్నానికి చెందిన జిగిరెడ్డి అక్కన్నపాత్రుడు గిడజాం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని, అనంతరం వేధింపులకు గురిచేయడం. కులం పేరుతో దూషించడం వంటి చర్యలతో ఆమె 2022లో అన్నవరంలో కేసు పెట్టిందని ఆయన వివరించారు. కాగా జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత నిందితుడికి నాలుగేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధించారు.

ఇది ముంపు కాదట!

అధికారుల నిర్లక్ష్యంతో అందని పరిహారం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం మర్రిగూడెం గ్రామ ప్రథమ పౌరుడి ఇల్లు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఆ పంచాయతీ సర్పంచ్ సోడే రామయ్య ఇంట్లోకి నీరు చేరింది. ఆ గ్రామమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు ఉండగా అందులో దళితులే ఎక్కువ. వారి ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో అడవుల్లో తలదాచుకున్నారు. కానీ ఈ గ్రామం ముంపులో లేనట్టు అధికారులు చెప్పడంతో పరిహారం రాలేదు. దీంతో తమకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. సాక్షాత్తు సర్పంచ్ ఇల్లే నీట మునిగినా సచివాలయ అధికారులకు కనిపించలేదా అని విమర్శలొచ్చాయి. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ తగు చర్యలు తీసుకుని తమకు పరిహారం అందించాలని మర్రిగూడెం గ్రామస్తులు కోరారు. మండలంలోని భీమవరం గ్రామంతో పాటు పెద ఆర్కూర్, ఆబిచర్ల సచివాలయాల పరిధిలో కూడా పరిహారం రాలేదు. దీంతో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి స్పందించి అల్లూరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. వెంటనే వారికి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. - కూనవరం

అక్టోబరు 27న జూనియర్ ఇంజనీర్ ఉద్యోగ రాత పరీక్ష

యానాం, సెప్టెంబరు 26: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రజాపనులశాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ (సివిల్)కు సంబంధించి అక్టోబరు 27న రాత పరీక్షను నిర్వహిస్తామని ఎగ్జామ్ సెల్ ప్రతినిధి జైశంకర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పేపర్1, మధ్యాహ్నం 2.30నుంచి 4.30 వరకు పేపర్2 పరీక్ష ఉంటుంది. త్వరలో అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.


కపిలేశ్వరపురం: అంగర సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల


వన్నెచింతలపూడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు


రాజోలు: పొదలాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


ఆలమూరు: చొప్పెల్లలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాల అమలులో జవాబుదారీతనం

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సుభాష్


ద్రాక్షారామ: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 26: ప్రభుత్వం పథకాలు అమలులో జవాబుదారీ తనం కలిగిఉందని మంత్రి సుభాష్ అన్నారు. గురువారంరాత్రి రామచంద్రపురం మండలం ఉండూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఇప్పటికే పింఛన్లు పెంచి ఒకటో తేదీన ఇంటివద్ద అందజేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ ఇన్‌చార్జి దూడల శంకర నారాయణ, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, మండల పార్టీ అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, పెంకె సాంబశివరావు, మహిళా నాయకురాలు గజలక్ష్మి, సర్పంచ్ సీతామహాలక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతుల్లో సంతోషం : ఎమ్మెల్యే బండారు

ఆలమూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం ద్వారా రైతులలో సంతోషాన్ని నింపగలిగామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్లలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే బండారు ప్రసంగించారు. రైతుల భూములపై కన్నేసి లేనిపోని యాక్ట్‌లను తీసుకొచ్చి ప్రజలను గత ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. చొప్పెల్లలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొని చెత్తను శుభ్రం చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. చెత్తను సేకరించేందుకు మహిళలకు డస్ట్‌బిన్‌లను అందించారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీడీవో జాన్‌లింకన్, సర్పంచ్ దంగేటి చంద్రకళబాపనయ్య, నాయకులు మెర్ల గోపాలస్వామి, సూరపురెడ్డి సత్య, ఆకుల రామకృష్ణ, సుంకర కనకయ్య, అయినవిల్లి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలో భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను భయపెట్టిందని దీంతో ఆ యాక్ట్ రద్దుతో రాక్షసపాలన అంతమైందని సూచిస్తూ ఆలమూరు మండలం చొప్పెల్లలో గురువారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పంట భూములలో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బాణంతో బొమ్మకు నిప్పు పెట్టారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తి తిరోగమన దిశకు చేరుకోగా తిరిగి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వన్నెచింతలపూడిలోని కరికాలభక్త సామాజిక భవనంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నక్కా రాజారత్ననాగవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతిని అంకెలతో సహా ఎమ్మెల్యే ఆనందరావు వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 175 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నామన్నారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, సీనియర్ నాయకులు మట్ట మహాలక్ష్మీప్రభాకర్, పోలమూరి ధర్మపాల్, దంతులూరి వాసురాజు, నక్కా కృష్ణ, బోనం సత్యవరప్రసాద్, భాస్కర్ల రామకృష్ణ, ముత్తాబత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెలో కూటమి ప్రభుత్వం వెలుగులు : ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: ఎన్‌డీఏ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం పూర్తిస్థాయిలో జరుగుతుందని 100రోజుల పాలనలో ప్రతి పల్లెలో కూటమి ప్రభుత్వం వెలుగులు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పోతవరంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం స్థానిక కూటమి నాయకులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, డీఎల్‌డీవో ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎంపీడీవో ఎం.భారతీ, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరావు, పరిశీలకులు షేక్‌సుభాన్, సర్పంచ్ కొండయ్య, శిరిగినీడి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ 16వ వార్డు టీటీఆర్ నగర్‌లో కూటమి నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలిసి గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రానున్న కాలంలో అమలు చేయబోయే కార్యక్రమాలు, ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన పురోభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో రెడ్డి సుబ్బారావు, సలాది గంగరాజు, యాళ్ల ఉదయ్, సచివాలయ కార్యదర్శి సంగాని మురళీ పాల్గొన్నారు. అలాగే రాజేలంకలోని గోదశివారిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి ఇంటింటికీ వెళ్లి ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంకే సాధ్యం : ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని అంగరలో గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు దానేటి శరత్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, కూటమి నాయకులు పుత్సల శ్రీనివాస్, ముత్యాల వెంకట్రావు, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ, సిద్ధిరెడ్డి రామలింగేశ్వరరావు, అంగర రామనరసింహారావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో కొండలరావు, కార్యదర్శి సుభాకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన కూటమితోనే సాధ్యం: ఎమ్మెల్యే దేవ

రాజోలు: మౌలిక వసతుల కల్పన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పొదలాడలో శుభం గ్రాండ్‌వద్ద సర్పంచ్ కడలి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో ఉన్న 60 గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా కృషి చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంపవేమా, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపు గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 26: మహా సహస్రావధాని, ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ఈ నెల 28వ తేదీన అమలాపురంలో జరిగే కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనం అందించనున్నట్టు ఆనందు ధార్మిక సంస్థల నిర్వాహకుడు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం తెలిపారు. అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని జానకీరామర్స్ కల్యాణ మండపంలో 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు గరికపాటి ప్రవచనం ఉంటుందన్నారు. హిందూ ధార్మిక బంధువులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోటిపల్లి, సత్యవాడ, తామరపల్లిలో మంత్రి సుభాష్ పర్యటన

కె.గంగవరం, సెప్టెంబరు 27: కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం మండలంలోని కోటిపల్లి, సత్యవాడ గ్రామాల్లో పర్యటించారు. కోటిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ తమ్మా చిన్న, గొడవర్తి రామకృష్ణ, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, తామరపల్లిలో గొల్లయ్య వెంకన్న, సత్యవాడలో సలాది సత్యనారాయణ, వెంకన్న, శంకరం తదితరుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోట వెంకన్న, సలాది రమేష్, తాడి శ్రీను, చీకట్ల నాగేశ్వరరావు, ముంగి రమేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ముమ్మిడివరం, సెప్టెంబరు 26: యానాం నుంచి ఆటోలో నాన్ డ్యూటీపెయిడ్ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అల్లవరానికి చెందిన గుండుపల్లి వీరబాబు ఆటోలో యానాం నుంచి నాన్ డ్యూటీపెయిడ్ మద్యాన్ని తరలిస్తుండగా కొండాలమ్మచింత వద్ద ఆటో తనిఖీలో పట్టుబడ్డాడన్నారు. ఆటోను సీజ్‌చేసి అందులో ఉన్న మేన్సన్‌హౌస్ 150 నిబ్‌లు, 3 ఫుల్ బాటిళ్లు, 4 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్‌చేసి నిందితుడిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాణసంచా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ఆత్రేయపురం, సెప్టెంబరు 26: ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి, తాడిపూడి ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా సామగ్రి కలిగి ఉన్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు. అక్రమంగా తయారు చేసిన తారాజువ్వలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పటిక బెల్లంతో బండారుకు తులాభారం



ఆలమూరు, సెప్టెంబరు 26: ఆలమూరు మండలం చొప్పెల్ల శివాలయంలో పటిక బెల్లంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలుపొందాలని ఆ గ్రామానికి చెందిన సుంకర కనకయ్య అనే అభిమాని ఎన్నికల సమయంలో మొక్కుకోవడంతో గురువారం ఆలయంలో తులాభారం నిర్వహించారు.

ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటు సమీపంలో విద్యుత్ మంటలు

అల్లవరం, సెప్టెంబరు 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు బీచ్‌రోడ్డులో ఓఎన్జీసీ ప్లాంటు సమీపంలో గురువారం రాత్రి విద్యుత్ మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ తీగలు గాలికి కలిసిపోయి నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగగా పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటు రక్షణ గోడకు అతి సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర్లో ఈ విద్యుత్ మంటలు చెలరేగాయి. విద్యుత్ సిబ్బంది శ్రీనివాస్, ప్రసాద్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతోపాటు మంటలను అదుపు చేశారు. దీంతో ఓఎన్జీసీ అధికారులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఓడలరేవు బీచ్‌రోడ్డులో మంటలు ఆర్పివేశారని, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎటువంటి ప్రమాదంలేదని విద్యుత్‌శాఖ ఏఈ చెప్పారు.

ఉత్సాహంగా జిల్లా క్రీడాకారుల ఎంపికలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 26: గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 24న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు గురువారం పూర్తయ్యాయి. అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల అండర్-14, 17 బాలురు, బాలికల విభాగాల్లో వివిధ క్రీడలకు సంబంధించి మండలస్థాయి విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి, జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మానే దుర్గారావు, కూనపరెడ్డి సత్యనారాయణ ఆర్థిక సహకారంతో హెచ్‌ఎం లంక రాణి, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ కమిటీ కో ఆర్డినేటర్ కామన మధు, కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్‌తోపాటు 30 మంది పీడీలు, పీఈటీలు పోటీలను పర్యవేక్షించారు.

ఆకస్మిక తనిఖీ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 26: ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సమగ్ర శిక్ష అభియాన్ ఏఎస్ఎల్‌వో రమేష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనంచేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు, జి.పెద్దిరాజు పాల్గొన్నారు.

సచివాలయ వలంటీర్లను ఆదుకోవాలి

అమలాపురంటౌన్, సెప్టెంబరు 26: సచివాలయ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలో గాంధేయ మార్గంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ దశలవారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా చైర్మన్ కె.సత్తిబాబు తెలిపారు. సచివాలయ వలంటీర్లను ఆదుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలని కోరారు. అమలాపురం పట్టణ, మండల సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి వినతిపత్రం అందించారు.

వరద బాధితులకు రూ.50వేలు విరాళం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితులకు కాట్రేనికోన మండలం చెయ్యేరు పోలిశెట్టి లక్ష్మీపార్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.50 వేల చెక్కును గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేశారు. కలెక్టర్ వారిని అభినందించారు. ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవోలు, హెచ్‌ఎం ఎ.శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

కొత్తపేట, సెప్టెంబరు 26: ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన మెర్ల చంద్రావతికి గురువారం వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రూ.40వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూడాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 26: దశాబ్దాల కాలంగా శాశ్వత పరిష్కారానికి నోచుకోని డంపింగ్ యార్డు సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు అమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజును కోరారు. కమిషనర్ చాంబర్‌లో గురువారం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో సభ్యుల బృందం కమిషనర్‌ను కలిశారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంప్రోక్షణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 26: తిరుమల శ్రీవారి ప్రసాద లడ్డూ తయారీలో జరిగిన అపచారానికి ప్రాయశ్చితంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలుపుతూ ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పళ్లవారిపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంవద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరమహిళలు ఆధ్వర్యంలో గౌతమీ గోదావరి నది నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చి ఆలయ పురోహితులు పాణింగపల్లి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దూడల స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుద్దటి జమి, మద్దింశెట్టి పురుషోత్తం, బద్రి రమ, యలమంచిలి బాలరాజు, అత్తిలి బాబూరావు, గాలిదేవర బుల్లి, మాదాల శ్రీధర్, లంకలపల్లి జమి, చింతలపూడి వెంకటేశ్వరరావు, చిక్కం శ్రీను, రంకిరెడ్డి రాంబాబు, పళ్ల రాజబాబు, గోదశి గణేష్, గుత్తుల శ్రీను, పెన్నాడ శివ, గొలకోటి సాయిబాబు, మల్లిపూడి రాజాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): వైసీపీ హయాంలో తిరుమల అపవిత్రం చేశారని అందుకు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి హిందువులకు క్షమాపణలు చెప్పాలని టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంది వెంకటరాజు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తిరుమలలో దోపిడీ చేశారని ఆరోపించారు.

లడ్డూ అపవిత్రతపై నిరసన ర్యాలీ

అల్లవరం: తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రతకు కారకులైన వారిని శిక్షించాలని అల్లవరం మండలం బెండమూర్లంకలో భక్తులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. బెండమూర్లంక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సెంటర్ మీదుగా ఆంజనేయస్వామి ఆలయంవరకు నిరసన ర్యాలీ సాగింది. లక్ష్మీ వేంకటేశ్వర, విజయదుర్గ, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు వినతిపత్రాలు సమర్పించారు. బెండమూర్లంక- కొమరగిరిపట్నం కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. యాళ్ల వెంకటానందం, గిడుగు భాస్కరరావు, గుర్రం బాబ్జి, గుర్లింక వెంకటకృష్ణ, గుర్రం కృష్ణ, మండేలా సూర్యభగవాన్, యాళ్ల ఈశ్వరరావు, కంచర్ల శ్రీరామమూర్తి, లింగం చిన్ని, పిండి గణపయ్య, యాళ్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలతో ఆడుకున్న వైసీపీ ప్రభుత్వం

మామిడికుదురు: ప్రజల మనోభావాలతో వైసీపీ ప్రభుత్వం ఆడుకుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విమర్శించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా గురువారం గోగన్నమఠంలో కూటమి నాయకులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డెల్టా మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు, సొసైటీమాజీచైర్మన్ సాగి బాబు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, రుద్రరాజు పద్మరాజు, గుండుబోగుల పెదకాపు, మెండా ఆదినారాయణ, దొడ్డా జయరామ్, వర్ధినేని బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, అల్లు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక బోను వద్ద గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిన ఘటనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని బోను, లంక గ్రామ ప్రజలంతా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేపూరి రాజేశ్వరిపేసు, కొండా కిశోర్, పప్పుల ప్రసాద్, పడాల శ్రీను, గునిశెట్టి రాంజీ, రేపూరి వాసు, ముచ్చర్ల వెంకటేష్ (నాని) తదితరులు పాల్గొన్నారు

తిరుపతి లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడకంపై
జనసేన వర్సెస్ వైసీపీ

● వెంకన్న ఆలయానికి వైసీపీ ఎమ్మెల్సీ తోట వస్తే అడ్డుకుంటాం: లీలా
● వేంకటేశ్వర ఆలయానికి వచ్చితీరుతా: ఎమ్మెల్సీ తోట

మండపేట, సెప్టెంబరు 26: పవిత్ర తిరుమల క్షేత్రంలో లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగం జరిగిందంటూ సీఎం చంద్రబాబు తిరుమలక్షేత్రం లడ్డూపవిత్రను రాజకీయ దుర్బుద్ధితో మంటగలిపారని జంతువుల కొవ్వుతో లడ్డూ తయారు చేస్తున్నారని ఆయన చేసిన పాపాన్ని ప్రక్షాలన చేసేందుకు ఈనెల 28న మండపేటలో వున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఉదయం 10గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో పూజలు చేస్తారని పార్టీకార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. తోట పాల్గొనే పూజా కార్యక్రమాలకు నియోజక వర్గంలో వున్న వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని కోరింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండపేటలో వున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి వచ్చి శనివారం పూజలు చేస్తే అడ్డుకుంటామని మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం మండపేట లోవున్న వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి కూటమి శ్రేణులు నేతలు అంతా హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తిరుమల లడ్డూపై పూజలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు చెబుతుంటే ఆయనను విమర్శిస్తే సహించేదిలేదని లీలాకృష్ణ తోటను హెచ్చరించారు. మొత్తంమీద జనసేననేత లీలాకృష్ణ, వైసీపీ నేత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇద్దరు నేతలు మధ్య ప్రకటనల యుద్ధం మండపేట వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఏమేరకు ఉంటుందోనన్న ఉత్కంఠ ప్రజానీకంలో నెలకొంది.

'పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని గర్భిణులు గుర్తించాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 26: పౌష్టికాహారం ప్రాధాన్యంను బాలింతలు, గర్భిణులు గుర్తెరగాలని మంత్రి సుభాష్ కోరారు. గురువారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముందుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో వరలక్ష్మి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారాన్ని తీసుకోవాలి

మలికిపురం: ప్రతీ గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని పొందుతూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని మలికిపురం ఎంపీపీ ఎంవీ సత్యవాణి అన్నారు. మలికిపురం మండల పరిషత్ కార్యాలయంవద్ద మలికిపురం సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ కాకి లక్ష్మీదేవి, ఎంపీడీవో మంగాదేవి, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహలక్ష్మి, సూపర్‌వైజర్లు హైమావతి, ప్రసన్న, చంద్రకళ, మున్నీసా, అంగన్‌వాడీ వర్కర్లు స్వాతి, సుజాత పాల్గొన్నారు.

రాయవరం : మండలంలోని సోమేశ్వరంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణీలు, పిల్లలకు ఏవిధమైన పౌష్టికాహారం పెట్టాలనే విషయాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఏ.గజలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు వైఆర్‌కె పరమహంస, జనసేన నాయకులు శాకా కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు పి.వెంకటరత్నం, ఎం.వెంకటలక్ష్మి, సెక్టార్ సూపర్‌వైజర్ బి.విష్ణుకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

కపిలేశ్వరపురం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గ్రామసర్పంచ్ దాని మీనాకుమారి, ఈశ్వరరావు లు అన్నారు. గురువారం మండలంలోని వల్లూరులో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. నాయకులు వల్లూరి వీరబాబు, గుణ్ణం సుబ్బరాజు, ముత్యాల శ్రీధర్, కోట పుల్లాజీ, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొత్తపేట: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ తెలిపారు. గురువారం గంటి గ్రామంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పండ్లు, పిల్లలకు దుస్తులు సర్పంచ్ సాగి బంగార్రాజు సమకూర్చారు. కార్యక్రమంలో భూపతిరాజు సత్యనారాయణరాజు, గుత్తుల బుల్లియ్య, మట్టపర్తి భూలక్ష్మి, నక్కా గొంతమ్మ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతుకు అవగాహన కల్పించాలి


రైతుకు షేరు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 26: నేను రైతు కుటుంబం నుంచే వచ్చానని రైతు పడే బాధలు బాగా తెలుసని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలపై అధికారులు తప్పనిసరిగా అవగహన కల్పించాల్సి వుందని ఆయన స్పష్టం చేశారు. ముంగండ లక్ష్మీనరసింహ కళ్యాణ మండపంలో జరిగిన డొక్కా సీతమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మొదటి వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి సంస్థ చైర్మన్ ఆరుమిల్లి లాల్‌బహదూర్ అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో కష్టాల్లో ఉన్న కౌలు రైతులను విస్మరిస్తే వారిని ఆదుకున్న ఘనత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దేనని గుర్తు చేశారు. నేను కూడా ఒక రైతుగా ఈసంస్థలో షేరు తీసుకుంటున్నానని ప్రకటించి రూ.2 వేలను భారతీయ కిసాన్ సంఘ్ అఖిలభారత కార్యకారణి సభ్యుడు జలగం కుమారస్వామికి అందించారు. అనంతరం సంస్థలో షేరు తీసుకున్న రైతులకు సర్టిఫికెట్‌లు అందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఉద్యానశాఖ శాస్త్రవేత్త ఎ.కిరిటీ, ఉద్యానశాఖ అధికారి దిలీప్‌కుమార్, గణపతి వీరరాఘవులు, ముత్యాల జమ్మిలు, ఉప్పుగంటి భాస్కరావు, మాండవ శ్రీనివాసరావు, అడ్డాల గోపాలకృష్ణ, దొంగ రామ్మోహన్, చెరుకూరి గోపాలకృష్ణ, చొల్లంగి సత్తిబాబు, ఆరుమిల్లి సాయిబాబు, యండ్ర శ్రీనివాసరావు, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు పొడిగింపుపై రభస

● మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 26 : రోజువారి వేతనంపై పనిచేసే పారిశుద్యకార్మికుల సేవలు పొడిగింపుపై అధికార ప్రతిపక్ష కౌన్సిలర్ మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. గురువారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాలు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో రోజువారీ వేతనం తీసుకునే 20 మంది కార్మికుల సేవలు పొడిగింపుపై కౌన్సిలర్ వాడ్రేవు సాయి ప్రసాద్ మాట్లాడుతూ జనసంచారం ఉన్నచోట పారిశుధ్యం క్షీణించిందని శానిటరీ అధికారి ఒకవార్డుకు పరిమితమయ్యారని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసంచారం లేనిచోట పారిశుధ్యంపై అధికారులు దృష్టిసారిస్తున్నారని విమర్శించారు. ఈదశలో 3వ వార్డు కౌన్సిలరు అంకం శ్రీనివాస్ జోక్యం చేసుకుని తనవార్డులో పారిశుధ్యం బాగా ఉందని బాధ్యతగా చేయించుకోవాలన్నారు. కౌన్సిలర్లు అంకం శ్రీనివాస్, వాడ్రేవు సాయిప్రసాద్ మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. సచివాలయ కార్యదర్శులను అంతర్గత బదిలీలు చేయాలని వాడ్రేవు సాయిప్రసాద్ కోరారు. కమిషనర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ తప్పకుండా బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు. పార్కుల్లో పనిచేసే కార్మికులకు ఏప్రిల్ నెలనుండి వేతనాలు ఇవ్వాలని మహిళా కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మొదటి సమావేశంలో ఎజెండాలో 7 అంశాలు, రెండవ సమావేశంలో 4 అంశాలు ఆమోదించారు. పట్టణంలో వివిధ ఇళ్లపై కొనసాగుతున్న డబుల్ ఎసెస్‌మెంట్లు రద్దు చేస్తూ ఆమోదం తెలిపారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.18 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు26: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ.2,18,826లభించినట్టు ఈవో చక్రధరరావు తెలిపారు. .

మోడల్ మండలంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, సెప్టెంబరు 26: సఖినేటిపల్లి మండలాన్ని అత్యాధునిక మోడల్ మండలంగా తీర్చిదిద్దుతానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ సఖినేటిపల్లి మండలంలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పురోగతిని పెంపొందించేలా ప్రతీఒక్కరు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మండల ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల ఉద్యోగులతో వన్‌టూవన్ రివ్యూ నిర్వహించారు. ప్రధానంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేలా కృషి చేస్తానన్నారు. విద్యుత్ సమస్యలను తొలగించడంతో పాటు గుడిమూల గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని సేకరించామన్నారు. సఖినేటిపల్లి మండలంలో సమతా కల్యాణ మండపాన్ని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధిచేస్తామన్నారు. గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహలక్ష్మీప్రసాద్, ముప్పర్తి నాని, సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు (కిశోర్), దెందులూరి శ్రీహరిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీతహసీల్దార్ భాస్కర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉచిత వైద్య శిబిరం

ముమ్మిడివరం, సెప్టెంబరు 26: ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ వైద్య బృందం ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ప్రారంభించారు. వైద్య శిబిరంలో కోర్టు సిబ్బంది, కక్షిదారులు, న్యాయవాదులకు ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ షుగర్ పరీక్షలు, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

మలికిపురం కళాశాలపై విచారణకు కమిటీ

మలికిపురం, సెప్టెంబరు 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఏఎఫ్‌టీడీసీ ట్రస్టు ఆధ్వర్యంలోని ఎంవీఎన్‌జేఎస్-ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీతాలకోసం 16 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ అంశంలో కళాశాల కార్యకలాపాలపై తగు చర్యలు తీసుకోవాలంటూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా ముగ్గురితో ఎంక్వైరీ కమిటీ ఏర్పాటుచేస్తూ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు ఇచ్చింది. కళాశాల ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.కృష్ణ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్వీఎస్ఎన్ రవికుమార్‌లను సభ్యులుగా నియమించారు. ఈ ముగ్గురూ విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పోస్టాఫీసు ప్రహరీ నిర్మాణం

రాజోలు, సెప్టెంబరు 26: రాజోలులో ఐసీడీఎస్ కార్యాలయం వెనుక ఉన్న ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పోస్టాఫీసు ప్రహరీ గోడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజోలు ఇన్‌చార్జి తహసీల్దార్ మృత్యుంజయరావు గురువారం పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణం పంచాయతీ రోడ్డును ఆక్రమించి నిర్మించడం వల్ల తాగునీటి పైపులైను, డ్రైనేజీ నిర్మాణాలకు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని దారపురెడ్డి బాబ్జి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్థలాన్ని సర్వే చేసే వరకు ప్రహరీగోడ నిర్మాణం నిలుపుదల చేయాలని అధికారులు ఆదేశించినా కాంట్రాక్టరు దౌర్జన్యంగా పనులు చేస్తున్నారని తెలిపారు. అక్రమంగా నిర్మించిన పిల్లర్లు తొలగించకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఇదే ప్రాంగణంలో ట్రెజరీ నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమించి పోస్టాఫీసు భవనం నిర్మిస్తున్నారని ట్రెజరీ ఉద్యోగులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాజోలు గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు అడబాల విజయ్, ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణారావు, రేకపల్లి శ్రీను, నామన షణ్ముకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	దేవర-1
శ్రీలలిత	దేవర-1
శేఖర్ స్క్రీన్-1	దేవర-1
శేఖర్ స్క్రీన్-2	ఆయ్
రమా	ఆయ్
గణపతి	కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	గొర్రె పురాణం